-జాస్తి శ్రీకృష్ణవరప్రసాద్




"కోదండం చాలా గుట్టుమనిషి" అంటూ ఆ ఆఫీస్‌లో ఒక్కొక్కళ్లూ అనడం విని అదో కితాబేమో అనుకున్నాడు మాధవ్. అసలు గుట్టు క్రమంగా అర్థమైందతనికి.

కోదండం 'గాసిప్స్'లాంటి సమాచారాన్ని మాధవ్ చెవులకి చేరవేయడం ఓ అలవాటుగా మార్చుకున్నాడు.

కొలీగ్స్ గురించి ఏదో ఒకటి చెడుగా చెబుతుండేవాడు కోదండం.

అవి మాధవ్‌కి ఆసక్తి లేనివీ, అనవసరమన్పించేవీనూ.

"నేనిది చెప్పానని వెంటనే మరచిపోవాలి"

"ఇది రహస్యం సుమా!"

"నీకు మాత్రమే చెబుతున్నా"

"ఎవరికీ చెప్పొద్దూ"

"మనిద్దరిమధ్యే ఉండాల్సిన విషయం"

ఈ ముక్కల్లో ఒకటో రెండో కోదండం తాను చెప్పే విషయానికి మొదటో చివరో జోడిస్తాడు. అతనలా బుర్రతినేయడం చూస్తే ఇక త్రుంచకపోతే లాభం లేదన్పించింది మాధవ్‌కి.

ఆఫీస్‌లో మాధవ్ అందరికంటే జూనియర్. అందరితోనూ కల్సిపోయినట్టు ప్రవర్తించే కోదండం అతని మొహమాటాన్ని అలుసుగా తీసుకుని కాస్త కాదు గానీ ఎక్కువగానే అతిగా అవీ ఇవీ చెప్పడం మొదలుపెట్టాడు. మాధవ్ ఖర్మ కొద్దీ కోదండం దగ్గర అప్పుచేయాల్సి వచ్చింది.

అవి తర్వాత జీతం అందుకోగానే తీర్చేశాడు.

కానీ అప్పట్నించీ మాధవ్‌తో చనువు పెరిగిపోయినట్టు మాటల్లోనూ, చేతల్లోనూ ప్రదర్శించసాగాడు కోదండం. తరువాత ఈ విన్పించే ప్రక్రియకి బలవుతూ వచ్చాడు మాధవ్.

గాసిప్సా? నిజమా? అని అడగాలనుకున్నా మాధవ్‌కి మొహమాటం అడ్డొచ్చేది. ఒకవేళ నిజాలైనా వాటి గురించి నాకెందుకు అని మొహాన కొట్టినట్టు చెప్పాలని, మనసులో మాత్రమే అనుకునేవాడు మాధవ్.

కానీ ఎన్నాళ్లని భరించడం?

కోదండాన్ని అరికట్టడానికి ఏం చేయాలా? అని ఆలోచించిన మాధవ్‌కి చివరికి మొహమాటాన్ని పక్కన పెట్టేయడమే మంచి పరిష్కారమని తోచింది.

ఆ మర్నాడే ఏదో విన్పించిన కోదండంతో "నువ్వు చెప్పింది భలే వుందిలే! ఇది ఎవరికో ఒకరికి చెప్పకుండా ఉండలేనన్పిస్తోంది" అన్నాడు మాధవ్.

'నీమాటలు నా దగ్గర గుట్టుగా ఉండకపోవచ్చు' అనేది చూచాయగా తెలియపరుస్తూ.

"అయ్యబాబోయ్! మరెవరిదగ్గరా అనకు. కొంపకొల్లేరయిపోతుంది. వెంటనే ఒకళ్ళిద్దరి ఉద్యోగాలు ఊడినా ఊడతాయి. ఎందుకొచ్చిన పాపం! ఎవరికీ చెప్పవనే నమ్మకంతో నీకు చెప్పాను. దయచేసి చెప్పొద్దు. అలా అని నాకు మాటివ్వు" అని ఒట్టేయించుకున్నాడు కోదండం.

ఈ దెబ్బతో ఇక ఖచ్చితంగా కోదండం దగ్గర నిర్మొహమాటంగా ఉండాల్సిందేనని తేల్చుకున్నాడు మాధవ్.

రెండురోజులు గడవకుండానే "ఓ రహస్యం తెల్సింది చెప్పనా?" అంటూ మొదలెట్టబోయాడు

"అమ్మో. డేంజర్!" కోదండం అదిరిపాటుగా చూశాడు.

"డేంజర్ కాకుండా జాగ్రత్తపడతాన్లే. నేను ఎవరికి చెబుతానో వారితో "నీ మనసులోనే ఉంచుకో. మరెవరికీ చెప్పనని ఒట్టెయ్" అంటూ మాట తీసుకుంటాను సరేనా?" మాధవ్ వచ్చే నవ్వును ఆపుకుంటూ క్యాజువల్‌గా అన్నాడు.

కోదండం గుడ్లుమిటకరించాడు. నోరు తెరవలేదు.

కోదండం.

"ఇది విన్నాక మరెవరికీ చెప్పకూడదనిదా?" అనడిగాడు మాధవ్.

'అవును. ఎవరితోనూ అనకూడదు గుట్టుగా ఉంచాలి' అనుకుని

"నువ్వు నాకొక్కడికే చెప్పినట్టు నేనూ మరొక్కరికి మాత్రమే చెబుతాను. ఫర్వాలేదు కదూ!"

అదేగా మాధవ్‌కి కావాల్సింది.

"కోదండం చాలా గుట్టుమనిషి అంటారే. అంటే గుట్టుగా ఉండే మనిషనా? చాలామంది గుట్టు తెలుసుకుని ప్రచారం చేసే వాడనా?" కొలీగ్స్‌లో ఎవరిని అడిగి సందేహ నివృత్తి చేసుకోవాలా అని ఆలోచించసాగాడు మాధవ్.

★